క్లుప్తంగా

గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

మేళ్లచెరువు : మండలంలోని రామాపురం గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం పై విచారణ చేపట్టాలని గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకుండా నిధులు కాజేశారని ఆరోపించారు. వినతి పత్రం అందజేసిన వారిలో సైదేశ్వరరావు, సైదయ్య, వెంకయ్య, రామనరసయ్య, లక్ష్మీప్రకాశ్, హైమావతి, గ్రామస్తులు ఉన్నారు.

గ్రంథాలయం ప్రారంభం



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ కీత జయమ్మ

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రంథాలయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కీత జయమ్మధనమూర్తి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కరక్కాయలగూడెంలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని దాతలు అంకతి వెంటేశ్వర్లు, చింతకుంట్ల శ్రీనుతో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చింతకుంట్ల కలనావీరబాబు, వార్డు సభ్యులు కీత ధనమూర్తి, కీత రాజేశ్వరికృష్ణమోహన్, మల్లేపల్లి నర్సింహారావు, శ్రీను, కోటి, వెంకటేశ్వర్లు, యలమందయ్య, అప్పారావు, శ్రీను, వీరబాబు, పుల్లయ్య, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ రికార్డుల తనిఖీ



అల్లీపురంలో జీపీ రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ జానకిరాములు

మఠంపల్లి : మండలంలోని అల్లీపురం గ్రామ పంచాయతీ రికార్డులను బుధవారం ఎంపీడీఓ మామిడి జానకిరాములు తనిఖీ చేశారు. అదే విధంగా లాలితండాలో తెలంగాణ క్రీడా ప్రాంగణం, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల లో పాలకవర్గాల పదవీకాలం ముగిసినందున ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల ప్రకారం అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్‌లు బోడి రమేష్, కోలపూడి జోజి, పంచాయతీ కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, ఉమ, వార్డుసభ్యులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా కానుకమాత చర్చి ఉత్సవాలు ప్రారంభం



మాట్లాడుతున్న ఫాదర్ మార్టిన్

మఠంపల్లి : మండల కేంద్రంలోని కానుకమాత చర్చి ఉత్సవాలను బుధవారం సాయంత్రం స్థానిక శుభవార్త చర్చి విచారణ గురువులు మార్టిన్ ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు కానుకమాత చర్చిలో ప్రత్యేక పూజలు, భక్తిగేయాలు, కొవ్వొత్తుల సమర్పణ, అమ్మవారి ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి శౌరి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దైదా రాయలు, వస్కుల జయరాజు, కొమ్ము సైదులు, దేవపంగు ప్రసాద్, నాగరాజు, పొట్ట వెంకన్న, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులపై విచారణ



మఠంపల్లిలో అభివృద్ధి పనులపై విచారణ జరుపుతున్న అధికారులు

మఠంపల్లి : మఠంపల్లి మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపిన అధికారులు ఇటీవల కార్యదర్శిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా సర్పంచ్‌కు షోకాజు నోటీసులు ఇచ్చారు. రూ.75 లక్షల నగదు రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి నేతృత్వంలో గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన రోడ్లు, డ్రెయినేజీలు తదితర అభివృద్ధి పనులను కోదాడ డివిజన్‌కు చెందిన ఐదుగురు ఏఈఈలు, ఐదుగురు ఎంపీఓలు మరో ఇద్దరు లోకల్ ఫండ్ ఆడిటర్ల బృందం పరిశీలించి విచారణ జరిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో ఏఈఈలు సీహెచ్.లక్ష్మారెడ్డి, రంగారావు, బాబురావు, సాయిరాం, ఎంపీఓలు ఇబ్రహీం, పాండు రంగన్న, నాగేశ్వరరావు, ఆంజనేయులు, కార్యదర్శి మట్టయ్య, లోకల్ ఫండ్ ఆడిటర్లు తదితరులు పాల్గొన్నారు.

62,047 టన్నులు పెండింగ్

- సీఎంఆర్ వివరాలు వెల్లడించిన అధికారులు
- గడువు ముగిసినా గింజ బియ్యం కూడా అందజేయని 16 మిల్లులు



కోదాడ : ప్రభుత్వం రైతుల నుంచి సేకరించి మిల్లర్లకు అప్పగించిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు ఇవ్వాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వివరాలను అధికారులు వెల్లడించారు. ప్రభుత్వానికి బియ్యం అప్పగించడానికి విధించిన గడువు బుధవారంతో ముగుస్తుందని ఇదివరకే ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. దీనిలో భాగంగా జనవరి 27వ తేదీ వరకు కోదాడ డివిజన్‌కు సంబంధించి 2022- 23 వానాకాలంలో మొత్తం 31 మిల్లులకు గాను 19 మిల్లులు వందశాతం బియ్యం అప్పగించగా, 8 మిల్లులు 90 శాతం బియ్యం ఇచ్చాయి. నాలుగు మిల్లులు మాత్రం భారీగా బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఇక యాసంగి సీజన్‌కు సంబంధించి 29 మిల్లులకు గాను 15 మిల్లులు ఒక్క గింజ బియ్యం కూడా ఇవ్వలేదు. మిగిలిన 14 మిల్లులు 15 శాతం మాత్రమే బియ్యం ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

74,301 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా..

2022- 23 వానాకాలం సీజన్‌కు సంబంధించి కోదాడ డివిజన్‌లో ఉన్న 31 మిల్లులకు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యానికి 67 శాతం చొప్పున 74,301 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా మిల్లర్లు 61,071 టన్నుల బియ్యాన్ని అప్పగించారు. ఈ సీజన్‌లో భువనేశ్వరి రైస్ మిల్లు 1268 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉండగా గింజ బియ్యం కూడా ఇవ్వలేదు. ఆ తరువాత శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ 9,484 టన్నులు బియ్యం ఇవ్వాల్సి ఉంది. ఈ మిల్లు తనకు కేటాయించిన ధాన్యంలో 39 శాతం మాత్రమే బియ్యం ఇచ్చింది. ఇక మిగిలిన వాటిలో 8 మిల్లులు 90 శాతానికి పైగా బియ్యం ఇవ్వగా, 19 మిల్లులు వందశాతం సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అప్పగించాయి.

యాసంగి సీజన్‌లో ఇలా..

కోదాడ డివిజన్‌లో 2022- 23 యాసంగి సీజన్‌లో కోదాడ డివిజన్‌లో 29 మిల్లులకు ప్రభుత్వం సీఎంఆర్ కింద 85,223 క్వింటాళ్ల ధాన్యం కేటాయించింది. దీనిలో 67 శాతం కింద 57,099 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు ఈ డివిజన్‌లో కేవలం 8281 టన్నుల బియ్యం మాత్రమే ఇచ్చారు. ఇంకా 48, 817 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. మొత్తం 29 మిల్లుల్లో 15 మిల్లులు గింజ బియ్యం కూడా ఇవ్వలేదు. మిగిలిన 14 మిల్లులు 15 శాతం మాత్రమే బియ్యం ఇచ్చాయి. మిల్లులన్నింటికి 2023- 24 వానాకాలం సీజన్‌కు గాను మళ్లీ ధాన్యం కేటాయించారు. కొన్ని మిల్లులు మూడు సీజన్‌లకు సంబంధించిన బియ్యం ఇవ్వాల్సి ఉంది.

ఈ రెండు మిల్లుల్లోనే మతలబు

అధికారులు ప్రకటించిన వివరాల ప్రకారం డివిజన్‌లో రెండు మిల్లులకు ధాన్యం కేటాయించే విషయంలో అధికారులు ఎనలేని ప్రేమను చూపినట్లు తెలుస్తోంది. కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండకు చెందిన శ్రీ భువనేశ్వరి మిల్లుకు వానాకాలంలో 1894 టన్నుల ధాన్యం కేటాయించగా వీరు కేజీ బియ్యం కూడా ఇవ్వలేదు. అయినప్పటికీ వీరికి యాసంగి సీజన్‌లో మరోసారి 4357 టన్నుల ధాన్యం కేటాయించారు. ఇక శ్రీవెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు వానాకాలం సీజన్‌లో 23,325 టన్నుల ధాన్యం కేటాయించగా కేవలం 39 శాతం మాత్రమే బియ్యం ఇచ్చారు. వీరికి యాసంగిలో మరో 15,535 క్వింటాళ్లు, 2023-24లో వానాకాలం సీజన్‌కు మరోసారి 4030 టన్నుల ధాన్యం కేటాయించడం విస్మయం కలిగిస్తుందని పలువురు మిల్లర్లు అంటున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని వినతి



ఎమ్మెల్యే పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న ములకలపల్లి రాములు, తదితరులు

మునగాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బంజరు భూములలో గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకలపల్లి రాములు కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేసిన కోదాడ ఎమ్మెల్యే ఎస్.పద్మావతికి ఆయన వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో పేదల ఇళ్ల స్థలాల కోసం గ్రామం శివారులో ప్రభుత్వం కొనుగోలు చేసిన 14 ఎకరాల ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ కార్యాలయాలు, పక్కా భవనాలు నిర్మించారని, మిగిలిన భూమిని పేదలకు ఇళ్లస్థలాలకు కేటాయించి పట్టాలు ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అర్హులైన పేదలకు ఇళ్లస్థలాల కోసం పట్టాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సామపంగు జానయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఆరె.రామకృష్ణారెడ్డి, మండల కమిటీ నాయకులు కిన్నెర వెంకన్న, గడ్డం వెంకన్న, లంజేపల్లి చినవెంకన్న, సాలె రవి, సాలె గోవింద్, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ ఆర్డీఓ కార్యాలయం తనిఖీ

హుజూర్‌నగర్ : పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయాన్ని బుధవారం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం చింతలపాలెం మండలంలోని పులిచింతల ముంపు గ్రామమైన నెమలిపురి ప్రజలకు ఇళ్ల పట్టాలు, నిర్వాసితులకు డబ్బులు చెల్లింపుపై గ్రామస్తులతో చర్చించారు.



ఆర్డీఓ కార్యాలయంలో రిజిస్టర్‌లను తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ వెంకటరెడ్డి

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డి. శ్రీనివాసరావు

మేళ్లచెరువు : పశువైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డి. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో మైహోం సిమెంట్ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని పరిశ్రమ హెడ్ ఎస్.శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. కాగా, వైద్య శిబిరంలో 240 గేదెలు, ఆవులు, 7900 గొర్రెలు, మేకలు, పెంపుడు జంతువులు, కోళ్లకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉషారాణి, శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి,పరిశ్రమ జీఎం.నాగేశ్వరరావు, జగన్నాథరావు, రత్నం, ఏజీఎం శ్రీనివాస్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రెండవ విడత గొర్రెలు పంపిణీ చేయాలి

గత ప్రభుత్వం గొల్లకురుమలకు సబ్సిడీపై అందించిన గొర్రెల పంపిణీలో భాగంగా రెండవ విడత గొర్రెలను త్వరితగతిన అందించాలని లబ్ధిదారులు, పెంపకందారుల సంఘం నాయకులు కోరారు. ఈమేరకు మేళ్లచెరువు మండల కేంద్రంలో పశువైద్య శిబిరానికి హాజరైన పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.43,750 డీడీలను బ్యాంకుల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల వెంకటేశ్వర్లు, జనిగ సైదులు, శ్రీనివాస్, బసవయ్య, చల్లా మల్లయ్య, పరశురామ్, శివ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న గొర్రెల పెంపకందారుల సంఘం నాయకులు

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పలువురు విద్యార్థులు అధికారులుగా, రాజకీయ నాయకుల పాత్రలో అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండి సలీం షరీఫ్, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఈ.శ్రీనివాసరెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లింగయ్య, ఉపాధ్యాయులు పూర్ణచందర్‌రావు, పాండురంగాచారి, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, భిక్షం, వేణు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వపరిపాలన వేడుకలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

పంచాయతీ పాలకవర్గ సభ్యులకు సన్మానం



మునగాల : సన్మాన కార్యక్రమంలో పంచాయతీ పాలకవర్గం, సిబ్బంది, గ్రామస్తులు

మునగాల : పదవీకాలం బుధవారంతో ముగియడంతో మునగాల మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్, పాలకవర్గం, సిబ్బందిని పలువురు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం గ్రామ పంచాయతీ సిబ్బందికి సర్పంచ్ చింతకాయల ఉపేందర్ చేతుల మీదుగా దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్.చినవెంకయ్య, పంచాయతీ కార్యదర్శి కొల్లు శ్వేత, వార్డు సభ్యులు రంగమ్మ, ఉష, రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, రవి, చిన్నా, శ్వేత, సంధ్య, విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం

గరిడేపల్లి : మండలంలోని పరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవి కాలం పూర్తయిన సందర్భంగా బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు సర్పంచ్ వీరంరెడ్డి లక్ష్మీశంభిరెడ్డిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డి, ఉప సర్పంచ్ అనంతు సైదమ్మ, పంచాయతీ కార్యదర్శి రేణుక, వార్డు సభ్యులు కందుల కోటిరెడ్డి, ప్రభాకర్, రామకృష్ణ, సంతోషి, కృష్ణవేణి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లి : సర్పంచ్‌ను సన్మానిస్తున్న వార్డు సభ్యులు, తదితరులు

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

గరిడేపల్లి : గిరిజన తండాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలంలోని గారకుంట తండా గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 20లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామం నుంచి వ్యవసాయ పొలాలను వెళ్లేందుకు రైతులు ఇబ్బందులు పడుతుంటే గతంలో వంతెన నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు బాబునాయక్, పైడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాస్‌గౌడ్, బండా నర్సిరెడ్డి, రాంకోటి, పంచాయతీ కార్యదర్శి పాల్వాయి రమ్య, పెండెం ముత్యాలు, రూప్‌సింగ్, పూల్యా, సురభి సైదులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ పెండెం సుజాత

ఆరోగ్య ఉప కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసిన కేంద్ర బృందం

మోతె : మండల పరిధిలోని ఉర్లుగొండ గ్రామంలో గల ఆరోగ్య ఉప కేంద్రంలోని రికార్డులను బుధవారం కేంద్ర బృందం సభ్యులు సందీప్ చంద్రాకర్, అఖిల అన్సారీలు తనిఖీ చేశారు. అదేవిధంగా ఉప కేంద్రంలోని మందుల నాణ్యతా ప్రమాణాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ ప్రోగ్రాం అధికారి కిరణ్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేస్తా : ఎమ్మెల్యే

చిలుకూరు : ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఎస్.పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం చిలుకూరు మండల కేంద్రంతో పాటు బేతవోలు, జెర్రిపోతులగూడెం, చెన్నారిగూడెం, ఆచార్యులగూడెం, రామాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. బేతవోలులో నూతన అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. జెర్రిపోతులగూడెంలో పాఠశాల భవనం, సీసీ రోడ్లు, చెన్నారిగూడెంలో పల్లె దవాఖానా, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, చిలుకూరులో సీసీ రోడ్లు, రామాపురంలో మన ఊరు- మన బడి ద్వారా నిర్మించిన పాఠశాల భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆచార్యులగూడెం గ్రామంలో నిర్మించిన వంతెనను జెడ్పీ చైర్ పర్సన్ దీపికతో కలిసి ప్రారంభించారు. చిలుకూరులో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య, జెడ్పీటీసీ బొలిశెట్టి శిరీషానాగేంద్రబాబు, వైస్ ఎంపీపీ జనపనేని జానకీకృష్ణారావు, వైస్ ఎంపీపీ బజ్జూరి వెంకట్‌రెడ్డి, ఎంపీడీఓ ఈదయ్య, డీఈ సతీష్‌బాబు, పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డి, ఎంఈవో సలీమ్ షరీఫ్, సర్పంచ్‌లు వట్టికూటి చంద్రకళ నాగయ్య, నలబోలు సుజాత శ్రీనివాస్‌రెడ్డి, కొడారు బాబు, కమతం కొండలు, మీసాల గంగా లింగయ్య, ఎంపీటీసీలు వట్టికూటి ధనమూర్తి, నెమ్మాది సైదాబాబు, గ్రామ కార్యదర్శులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



చిలుకూరులో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతా

మునగాల : వచ్చే ఐదేళ్ల తన పదవీకాలంలో మునగాల మండలాన్ని మరింత అభివృద్ధి చేసి ఆదర్శ మండలంగా తీర్చుదిద్దుతానని కోదాడ ఎమ్మెల్యే ఎస్.పద్మావతి అన్నారు. బుధవారం మునగాలతో పాటు రేపాల, నేలమర్రి, తిమ్మారెడ్డిగూడెం గ్రామాల్లో అప్పటి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె స్థానిక ఎంపీపీ ఎలక బిందుతో కలిసి ప్రారంభించారు. మాధవరం గ్రామ పరిధిలో ఎస్సీ సబ్‌ప్లాన్ కమిటీ నిధుల నుంచి మంజూరైన రూ.పదిలక్షల వ్యయంతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాల్‌తో పాటు తిమ్మారెడ్డిగూడెంలో సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొలిశెట్టి బుచ్చిపాపయ్య, పంచాయతీరాజ్ డీఈ శ్రీహర్ష, ఇన్‌చార్జ్ ఏఈ జూవ్వాజి రాము, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్‌లు చింతకాయల ఉపేందర్, పల్లి రమణ, నంద్యాల విజయలక్ష్మి, జీడయ్య, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఉప్పుల రజిత, కాసర్ల కల్పన, ఎర్రం శ్రీనివాసరెడ్డి, సొంపంగు మోహన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, జైపాల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, జానకిరెడ్డి, బోస్, శ్రీలత, కాసర్ల కోటేశ్వరరావు, వేనేపల్లి వీరబాబు, వరికెల రమేష్, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

మునగాల : మండల కేంద్రంలో ఫిబ్రవరి 3న జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించబోయే చెకుముకి జిల్లా సైన్స్ సంబరాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఎస్.పద్మావతి కోరారు. ఈమేరకు బుధవారం ఆమె మునగాలలో ఎంపీపీ ఎలక బిందుతో కలసి జన విజ్ఞాన వేదిక చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు, రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ జాఫర్, మండల మాజీ ఎంఈఓ ఓరుగంటి రవి, స్థానిక సర్పంచ్ చింతకాయల ఉపేందర్, జనవిజ్ఞాన వేదిక సభ్యులు వైవీ.రామనారాయణరెడ్డి, గోవర్దన్, గ్రామపెద్దలు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపాలను మండలంగా ఏర్పాటు చేయాలి

మునగాల : మండలంలోని రేపాల మేజర్ గ్రామ పంచాయతీని ప్రత్యేక మండలంగా ఏర్పాటు చేయాలని బుధవారం రేపాల పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, రేపాల మండల జలసాధన సమితి సభ్యులు కోదాడ ఎమ్మెల్యే ఎస్.పద్మావతికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ మండలంలో నాన్‌కెనాల్ కింద ఉన్న 11 గ్రామపంచాయతీలను కలుపుతూ ప్రత్యేక నూతన రూరల్ మండలం ఏర్పాటు చేయాలని కోరారు. తమ ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మునగాల : మాధవరంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

అనంతగిరి : గ్రామాల అభివృద్ధిని కాంక్షిస్తూ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ వేనేపల్లి వెంకటేశ్వరరావు, మరో ఆరుగురు వార్డు సభ్యులతో పాటు తొంభై ఎనిమిది కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే పద్మావతి, మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన స్ట్రిట్ సెంట్రల్ లైటింగ్, హరిహర అయ్యప్ప దేవాలయ సీసీ రోడ్డును వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముస్కు శ్రీనివాసరెడ్డి, గునుకుల గోపాల్‌రెడ్డి, కొండపల్లి వాసు, ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ కొణతం ఉమాశ్రీనివాసరెడ్డి, బుర్ర పుల్లారెడ్డి, నర్సింహరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, బాబు నాయక్, వెంకటరెడ్డి, కొండయ్య పాల్గొన్నారు.

ఘనంగా రిటైర్డ్ ఉద్యోగుల జన్మదిన వేడుకలు



రిటైర్డ్ ఉద్యోగులను సత్కరిస్తున్న పెన్షనర్స్ సంఘం నాయకులు

కోదాడఅర్బన్ : కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో పలువురు రిటైర్డ్ ఉద్యోగుల జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని విశ్రాంత ఉద్యోగుల సంఘం కోదాడ యూనిట్ నాయకులు శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. వారితో కేక్ కట్ చేయించి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీతారామయ్య, యూనిట్ నాయకులు వెంకటేశ్వరరావు, లక్ష్మీనర్సయ్య, సుదర్శన్‌రెడ్డి, రాంబాబు, అమృతారెడ్డి, విద్యాసాగర్, వరప్రసాద్‌రావు, భ్రమరాంబ, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి



మఠంపల్లి : అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ మంగా



పాలకవీడు : శూన్యపహాడ్‌లో పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొన్న అధికారులు, గ్రామస్తులు

మఠంపల్లి : పౌరహక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ మంగా కోరారు. బుధవారం మండలంలోని యాతవాకిళ్లలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఆమె అంగన్‌వాడీ కేంద్రాలలో రికార్డులను తనిఖీ చేసి, ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోలాహలం లక్ష్మీనరసింహరాజు, ఉపసర్పంచ్ శాంతి, ఆర్ఐ సుజిత్‌కుమార్, కార్యదర్శి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ భిక్షంనాయక్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులపై అవగాహన ఉండాలి

పాలకవీడు : రాజ్యాంగం కల్పించిన హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీదేవి అన్నారు. బుధవారం మండలంలోని శూన్యపహాడ్ గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ దుకాణాన్ని తనిఖీ చేశారు. సమావేశంలో సర్పంచ్ భీకి, ఎస్సై లింగయ్య, ఎంపీటీసీ కవిత నీమీనాయక్, పంచాయతీ కార్యదర్శి నరేష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

యువత విద్యపై దృష్టి సారించాలి

మోతె : దళిత వాడల్లో యువత, మహిళలు విద్యపై దృష్టి సారించాలని తహసీల్దార్ ప్రకాష్‌రావు అన్నారు. బుధవారం మోతె మండల పరిధిలోని నర్సింహాపురం గ్రామంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కీసర లక్ష్మి, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని 18, 19 వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గెల్లి రవి, షేక్.సైదా, కుంట ఉపేంద్ర, సైదులు, వల్లపుదాసు కృష్ణ, ఎల్లమ్మ, వెంకటేశ్వర్లు, రమ్య, వీరస్వామి, సత్యమయ్య, సైదమ్మ, ఉపేంద్ర, వెంకన్న పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు నాయకుల సన్మానం

నేరేడుచర్ల : ఉత్తమ మున్సిపల్ కమిషనర్‌గా అవార్డు అందుకున్న నేరేడుచర్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లును బుధవారం సీపీఐ మాస్‌లైన్ (ప్రజాపంథా) నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాస పల్లయ్య, సయ్యద్ హుస్సేన్, వాస కరుణాకర్, పావని, చందనబోయిన లక్ష్మి, శ్యామల తదితరులు ఉన్నారు.

గీత కార్మికుడికి పరామర్శ

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి గ్రామానికి చెందిన అనంతు చిన్నభిక్షాలు తాటిచెట్టు పైనుంచి కిందపడడంతో గాయాల పాలయ్యాడు. దీంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా బుధవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆరెపూరి నారయణ పరామర్శించి మనోధైర్యం కల్పించారు.

ఎంఎస్ఎఫ్ సమావేశం

హుజూర్‌నగర్ : ఎంఎస్ఎఫ్ బలోపేతానికి కృషి చేయాలని పలువురు ఎంఎస్ఎఫ్ నాయకులు కోరారు. బుధవారం హుజూర్‌నగర్‌లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో పి.నవీన్ కుమార్, బి.సైదులు, ఎం.గోపి, వీరబాబు, వంశీ తదితరులు పాల్గొన్నారు.